# అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేయొచ్చు!

- తేల్చి చెప్పిన తెలంగాణ హైకోర్టు



హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చునని హైకోర్టు తీర్పు చెప్పింది. అపరిచితుడి నుంచి దారినపోయే దానయ్య వరకు ఎవరైనా ఒకరు ఫిర్యాదు చేయవచ్చునని తేల్చి చెప్పింది. అక్రమ నిర్మాణాల బాధితుడే ఫిర్యాదు చేయాలని ఏమీ లేదని స్పష్టంచేసింది. బయట వ్యక్తి అంటే నేరుగా బాధితుడు కాని వ్యక్తి ఫిర్యాదు చేశాక అధికారుల నుంచి స్పందన లేకపోతే హైకోర్టును ఆశ్రయించవచ్చునని చెప్పింది. ఈ మేరకు జస్టిస్ టీ వినోద్‌కుమార్ ఇటీవల తీర్పు వెలువరించారు. హైదరాబాద్, బేగంపేట బీఎస్ మక్తాలో 400 చదరపు గజాల్లో అనుమతి లేకుండా నిర్మించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ చేగూరి అనిత ఆండాళ్లు పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్, ఆమె కొడుకు 200 గజాల చొప్పున స్థలాలను కొనుగోలు చేసి విడివిడిగా రెండంతస్థుల నిర్మాణాలకు అనుమతి తీసుకుని ఆ తర్వాత 400 చదరపు గజాల్లో గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి 4 అంతస్థుల నిర్మాణాలకు అనుమతులను సవరించారని న్యాయవాది చెప్పారు. భవన పటిష్టత, వాస్తు వంటి పేరుతో అయిదో అంతస్థు నిర్మించారని వివరించారు. ఆపై క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆ ప్రాంతానికి సంబంధం లేని, బాధితుడు కాని నరేందర్ అనే వ్యక్తి పిటిషన్ వేస్తే హైకోర్టు గతంలో ఉత్తర్వులు ఇచ్చిందని, వాటిని రద్దు చేయాలని కోరారు. వాదప్రతివాదనలు విన్న తర్వాత.. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయడానికి బాధితుడై ఉండక్కర్లేదని, ఎవరైనా సంబంధంలేని వ్యక్తి కూడా ఫిర్యాదు చేయవచ్చునని న్యాయస్థానం వెల్లడించింది. పిటిషనర్ చేసుకున్న క్రమబద్ధీకరణ దరఖాస్తుపై ప్రవీణ్‌కుమార్ కేసులో ఇదే హైకోర్టు వెలువరించిన తీర్పులోని మార్గదర్శకాల మేరకు వ్యవహరించాలని జీహెచ్ ఎంసీని ఆదేశించింది. పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

# కొన్నది తక్కువ.. ప్రచారం ఎక్కువ !

మొదటిపేజీ తరువాయి...

కొనుగోలు చేస్తే కాంగ్రెస్ సర్కారు 72 లక్షల టన్నులు కొనుగోలు చేసింది. కాంగ్రెస్ సర్కారు రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్టు ఎలా అవుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### చెప్పినంత కూడా కొనలేదు

ఈ యాసంగిలో 137 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో సుమారు 80-85 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని తొలుత అంచనా వేసింది. కానీ కొనుగోలు లక్ష్యాన్ని పౌరసరఫరాలసంస్థ 70.13 లక్షల టన్నులకు తగ్గించింది. ఇప్పుడు 72 లక్షల టన్నులు కొనుగోలు చేసి.. లక్ష్యానికి మించి కొనుగోలు చేశామంటూ ప్రకటించుకుంటున్నది. వాస్తవానికి ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల అంశంలో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. అకాల వర్షాలు.. సర్కారు నిర్లక్ష్యంతో నష్టపోయారు. సర్కారుపై ఆశలు సన్నగిల్లి కొందరు రైతులు తక్కువధరకే ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను తగ్గించేందుకు కావాలనే నిర్లక్ష్యం చేసిందనే విమర్శలు వినిపించాయి. ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటే 80 లక్షలకు పైగా ధాన్యం వచ్చేదని పౌరసరఫరాలసంస్థ అధికారులు చెప్తున్నారు.



### బీఆర్‌ఎస్ హయాంలో పుట్లకొద్ది కొనుగోళ్లు

బీఆర్‌ఎస్ హయాంలో ప్రభుత్వం రైతుల నుంచి పుట్ల కొద్ది వడ్లు కొనుగోలు చేసింది. 2018-19లో రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు కేవలం 37.05 లక్షల టన్నులు మాత్రమే. బీఆర్‌ఎస్ సర్కారు ధాన్యం కొనుగోలును భారీగా పెంచింది. 2023-24లో యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమయానికి కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చింది. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు మందగించాయి. నిరుడు యాసంగిలో 47.97 లక్షల టన్నులకే పరిమితమైంది. ఇక ఈ యాసంగిలో 72 లక్షల టన్నులు కొనుగోలు చేసింది. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్టు గొప్పలు చెప్తున్న సర్కారు.. నిరుడు యాసంగిలోనూ కొనుగోళ్లు భారీగా ఎందుకు తగ్గాయో సమాధానం చెప్పాలని రైతుసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

**యాసంగి ధాన్యం కొనుగోళ్ల వివరాలు**

| సంవత్సరం | కొనుగోలు చేసిన ధాన్యం (లక్షల టన్నులు) |
|---|---|
| 2014-15 | 13.26 |
| 2015-16 | 8.43 |
| 2016-17 | 37.22 |
| 2017-18 | 35.74 |
| 2018-19 | 37.05 |
| 2019-20 | 64.17 |
| 2020-21 | 92.39 |
| 2021-22 | 50.39 |
| 2022-23 | 66.84 |
| 2023-24 | 47.97 |
| (ఇక్కడి నుంచి కాంగ్రెస్ సర్కారు) | |
| 2024-25 | 72.00 |

## రాజన్న గోశాలలో మరో రెండు కోడెలు మృతి

**ఇప్పటి వరకు 33 కోడెలు మృతి**

వేములవాడ టౌన్, జూన్ 7: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో అనారోగ్యంతో ఉన్న మరో రెండు కోడెలు శనివారం మృతిచెందినట్టు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోశాలలో 1,300 కోడెలు ఉండగా, ప్రస్తుతం 14 కోడెలకు వెటర్నరీ డాక్టర్లు చికిత్స అందిస్తున్నట్టు పేర్కొన్నారు. 10 కోడెలు కోలుకుంటున్నాయని, మరో రెండు కోడెల పరిస్థితి విషమంగా ఉన్నట్టు వెల్లడించారు. కాగా ఇప్పటివరకు 33 కోడెలు మృతి చెందినట్టు పేర్కొన్నారు.

## 28బార్లకు 36.68 కోట్ల ఆదాయం

- జీహెచ్‌ఎంసీలో 24బార్లకు 3,520..
- జిల్లాలోని 4బార్లకు 148 దరఖాస్తులు



హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): బార్లకు దరఖాస్తులు ఆహ్వానించడం ద్వారా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ భారీగా ఆదాయాన్ని సమకూర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 28బార్లకు ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్ గడువు శుక్రవారంతో ముగియడంతో.. వాటి ద్వారా రూ.36.68 కోట్ల ఆదాయం వచ్చింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 24బార్లకు, మిగిలిన జిల్లాల్లో మరో 4బార్లకు దరఖాస్తులకు స్వీకరణకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. జీహెచ్‌ఎంసీలోని 24 బార్లకు 3,520 దరఖాస్తులు రాగా, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలో 4 బార్లకు 148 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా రూ.36.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఈనెల 13న జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24బార్లకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సీ హరికిరణ్, ఆయా జిల్లాల పరిధిలోని బార్లకు కలెక్టర్లు డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తారని రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పీ దశరథ్ వెల్లడించారు.

# 40వేల కొత్త ఆటోలకు అనుమతి

- ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీ ఆటోలకు మాత్రమే..
- ఓఆర్ఆర్ లోపల పరిమిత సంఖ్యలో అనుమతికి ప్రభుత్వం జీవో జారీ

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): నగరంలో పెరిగిన జనాభా రద్దీ, కాలుష్యం దృష్ట్యా కొత్త ఆటో రిక్షాలకు ప్రభుత్వం పర్మిట్లు ఇవ్వలేదు. ప్రస్తుతం ఆ పరిమితిని సడలిస్తూ జీహెచ్‌ఎంసీ, ఓఆర్ఆర్ లోపల పరిమిత సంఖ్యలో ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీ ఆటో రిక్షాలకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 263 విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా కారణంగా ఆటో రిక్షా పర్మిట్లకు బాగా డిమాండ్ పెరిగింది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, నగరంలో వాయు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడానికి, మెరుగైన ప్రజారవాణా కోసం ఎలక్ట్రిక్/ఎల్పీజీ/సీఎన్‌జీ ఆటో రిక్షాలను అనుమతించడం అవసరమని ప్రభుత్వం భావించింది. దీంతో ఓఆర్ఆర్ లోపల కొత్తగా 20వేల ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలు, 10వేల కొత్త ఎల్పీజీ ఆటోలు, మరో 10వేల కొత్త సీఎన్జీ ఆటో రిక్షాలకు అనుమతి ఇచ్చింది. వీటితో పాటు డీజిల్, పెట్రోల్ వాహనాలకు సంబంధించిన రేట్రోఫిట్టింగ్ చేసి, వాటి ఇంజన్‌ను ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీగా మార్చుకోవడానికి 25వేల వాహనాలకు అవకాశం కల్పించింది. అలాగే ఇప్పటివరకు ఉన్న డీజిల్, పెట్రోల్ ఆటో రిక్షాల ట్రాన్స్‌ఫర్, డీజిల్, పెట్రోల్ కొత్త ఆటో రిక్షాలకు ఓఆర్ఆర్ పరిధిలో అనుమతించబవు. ప్రభుత్వ ఆదేశాల ద్వారా దాదాపు 65వేల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



# నేడే మంత్రివర్గ విస్తరణ!

మొదటిపేజీ తరువాయి...

మాదిగ సామాజిక వర్గం నుంచే అవుతుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉండొచ్చని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి.

### అనూహ్యంగా తెరపైకి స్పీకర్ పేరు

సుదర్శన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్ పేర్లు దాదాపు ఖరారైనట్టేనని గాంధీభవన్ వర్గాల నుంచి తొలుత లీకులు వచ్చాయి. శనివారం ఉదయం అనూహ్యంగా శాసనసభాపతి గడ్డం ప్రసాద్ పేరు తెరపైకి వచ్చింది. వివేక్ కుటుంబం నుంచి ఇప్పటికే ముగ్గురికి పదవులు ఇవ్వడంతో మళ్లీ వారికే ఇస్తే ప్రజల్లోకి ప్రతికూల సంకేతాలు వెళ్తాయని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ అభ్యంతరం వ్యక్తంచేసినట్టు తెలిసింది. దీంతో గడ్డం ప్రసాద్ పేరు తెరపైకి వచ్చింది. తనకు అవకాశం ఇవ్వకుంటే ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి వస్తుందని వివేక్ హెచ్చరించినట్టు తెలిసింది. మీడియాతోపాటు ఆర్థికంగా బలంగా ఉన్న ఆయన కుటుంబాన్ని వదులుకోవడం ఇష్టంలేని అధిష్ఠానం మధ్యేమార్గంగా వివేక్‌కు స్పీకర్ పదవి ఆఫర్ చేసినట్టు సమాచారం. అయితే, తనకు మంత్రి పదవి తప్ప మరేమీ వద్దని ఆయన కరాఖండిగా చెప్పినట్టు తెలిసింది. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి విస్తరణలో చోటు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధిష్ఠానాన్ని కోరిన విషయం తెలిసిందే. అధిష్ఠానం ఓకే అనడంతో సుదర్శన్‌రెడ్డి బెర్తు దాదాపు ఖరారైనట్టేనని చెప్తున్నారు. దీంతో ఓసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డికి దారులు మూసుకుపోయినట్టేనన్న ప్రచారం జరుగుతున్నది. బీసీ సామాజిక వర్గం నుంచి ఒకరికి అవకాశం ఉన్న నేపథ్యంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దాదాపు ఖరారైనట్టు తెలిసింది.

### నాలుగో బెర్తు కవ్వంపల్లికే!

అసలైన మాదిగలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని మాదిగ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం మాదిగ సామాజిక వర్గం నుంచి దామోదర రాజనర్సింహ మంత్రివర్గంలో ఉన్నారు. మాదిగ ఎమ్మెల్యేలంతా శనివారం మరోసారి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. మీనాక్షి నటరాజన్ తోనూ మాట్లాడినట్టు తెలిసింది. నాలుగో బెర్తు నింపితే కచ్చితంగా మాదిగలకు అవకాశం ఇస్తామని వారు హామీ ఇచ్చినట్టు తెలిసింది. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాణ పేరు వినిపిస్తున్నది.

### ఎస్టీలకు ఆ రెండు పదవులు

ఎస్టీ సామాజిక వర్గం నేతలు కూడా తమకు విస్తరణలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సామాజిక వర్గం నుంచి ఆదివాసీ మహిళ సీతక్క ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. తక్కువ జనాభా కలిగిన ఆదివాసీకి మంత్రి పదవి ఇచ్చి తమకు అన్యాయం చేస్తున్నారని లంబాడ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖ రాశారు. రాష్ట్ర నాయకత్వాన్ని కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అయితే ఈ విస్తరణలో చోటు కల్పించడం సాధ్యం కాదని అధిష్ఠానం తేల్చి చెప్పినట్టు తెలిసింది. మంత్రి పదవికి బదులుగా దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌కు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఆఫర్ చేసినట్టు తెలిసింది. దీనికి వారు కూడా అంగీకరించినట్టు సమాచారం.

### కొండా సురేఖకు ఉద్వాసన?

మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తారనే ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ అనుకూల సోషల్ మీడియా గ్రూప్‌ల్లోనే ఈ వార్త ఎక్కువ వైరల్ అవుతున్నది. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన ఒక కటుంబంపై ఆమె చేసిన అనుచిత వ్యాఖ్యలే ఆమె మెడకు చుట్టుకున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే కొండా సురేఖకు ఉద్వాసన తప్పదని చెప్తున్నారు.

### సీఎంతో మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు..

మాదిగ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. తమ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని విజ్ఞప్తిచేశారు. సీఎంను కలిసిన వారిలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మానకొండూర్, తుంగతుర్తి, నకిరేకల్, చేవెళ్ల ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, వేముల వీరేశం, కాలె యాదయ్య ఉన్నారు. మంత్రివర్గంలో ఇప్పటికే మాదిగ సామాజిక వర్గానికి చెందిన అందోల్ ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహ మంత్రిగా వ్యవహరిస్తుండడం, మంత్రి పదవి కోసం విపరీతమైన పోటీ ఉన్న నేపథ్యంలో ఆ సామాజిక వర్గానికి మరోమారు చోటు దక్కడం అనుమానమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# వేలానికి స్వగృహ ఫ్లాట్లు

## హౌసింగ్‌బోర్డు స్థలాలు సైతం..

## 20న అమ్మకాల వివరాలతో నోటిఫికేషన్

## హౌసింగ్ బోర్డు కమిషనర్ గౌతమ్ వెల్లడి



హైదరాబాద్ , జూన్ 7(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డుకు చెందిన ఫ్లాట్లు, ఖాళీ స్థలాలను బహిరంగ వేలం వేయనున్నట్టు హౌసింగ్ బోర్డు కమిషనర్ వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నిచోట్ల పూర్తయిన అపార్ట్‌మెంట్లు, మరికొన్ని చోట్ల నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లను ఉన్నతీరుగానే విక్రయించనున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 20న దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్టు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీస్థలాలు, ఫ్లాట్లను బహిరంగ వేలం వేయాలని హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ సంస్థలు నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి గృహ నిర్మాణశాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రకాశ్, హౌసింగ్ బోర్డు కమిషనర్ గౌతం సిద్ధం చేసిన ప్రతిపాదనలకు సంబంధించి వనరుల సమీకరణలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఈ నెల 20 నాటికి ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని నిర్ణయించారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల్లోని 11 ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తయిన, పాక్షికంగా పూర్తయిన అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్లతోపాటు, ఓపెన్ ప్లాట్లు.. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోని నాలుగు ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్టు గౌతమ్ తెలిపారు. రాజీవ్ స్వగృహకు సంబంధించి గాజుల రామారం, పోచారం, ఖమ్మం పోలేపల్లి ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న టవర్లలో (ఒక్కోదానిలో సుమారు 100 నుంచి 150 వరకు ఫ్లాట్లు ఉన్న టవర్‌ను ఒకే యూనిట్‌గా) ఏకమొత్తంగా విక్రయించనున్నట్టు, బిల్డర్లు, ఒక గ్రూప్‌గా ఏర్పడి కానీ, బహుళ అంతస్థుల భవనాల అవసరం ఉన్న సంస్థలు కానీ వీటిని తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

**వేలం వేయనున్న ఫ్లాట్లు, ప్లాట్ల వివరాలు**

- **రాజీవ్ స్వగృహ వివరాలు:** రంగారెడ్డి జిల్లా తొర్రూరులో 514, కుర్మల్‌గూడలో 20, చందానగర్‌లోని 3 ఓపెన్ ఫ్లాట్లు, బండ్లగూడలో 159 పూర్తయిన ఫ్లాట్లు
- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని గాజుల రామారంలోని 5 టవర్లలోని పూర్తికాని కట్టడాలు, పోచారంలోని పూర్తయిన 601 ఫ్లాట్లు, అసంపూర్తిగా ఉన్న 6 టవర్లలోని వివిధరకాల ఫ్లాట్లు, బహదూర్‌పల్లిలోని 69 ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి.
- మహబూబ్ నగర్ జిల్లాలోని పోతులమడుగులో 111 , అమిస్తపూర్ లోని 45 ఓపెన్ ప్లాట్లు
- ఖమ్మం జిల్లాలో పోలేపల్లిలో అసంపూర్తిగా ఉన్న 8 టవర్లతో పాటు 3.38 ఎకరాల ఖాళీ స్థలం.
- **హౌసింగ్ బోర్డు స్థలాలు:** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ(కేపీహెచ్‌బీ)
- 4వ ఫేజ్‌లో ఖాళీగా ఉన్న 7.33 ఎకరాల భూములు, అదే కాలనీలో ఉన్న రెండు ఓపెన్ ప్లాట్లు (4598 చదరపు గజాలు, 2420 చదరపు గజాలు) ఈ-ఆక్షన్ ద్వారా విక్రయించనున్నారు.
- హైదరాబాద్ నాంపల్లిలోని 1,148 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఖాళీ స్థలం, సంజీవరెడ్డినగర్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్‌కు చెందిన 2,605 చదరపు గజాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
- సంజీవరెడ్డినగర్‌లోని కమ్యూనిటీ హాలు (సెల్లార్, స్టిల్ట్, జి+1) 22,285 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 37,070 చదరపు అడుగుల పార్కింగ్ స్థలంతో పూర్తయ్యే స్థితిలో ఉన్నది. దీన్ని ఫంక్షన్ హాలు కోసం ఉపయోగించుకోవచ్చు.

# 16 నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి ?

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 7: పెద్దపల్లి జిల్లా రామగుండం కర్మాగారంలో యూరియా ఉత్పత్తిని ఈ నెల 16న ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి మేలో వార్షిక మరమ్మతుల్లో భాగంగా ఆర్‌ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్ చేస్తారు. మళ్లీ జూన్‌లో తెరుస్తారు. అయితే ఈ నెల 8నే మరమ్మతులు పూర్తిచేయాల్సి ఉండగా, యూరియా తయారీలో కీలకమైన క్యాటలిస్ట్ కెమికల్ రాక జాప్యం జరిగింది. దీంతో 8 రోజులు ఆలస్యంగా ఉత్పత్తి ప్రారంభించనున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన నిపుణులు యుద్ధప్రాతిపదికన ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను ఉత్పత్తి దశలోకి తేవడానికి చర్యలు ప్రారంభించారు. 11న ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను లైటాఫ్ చేస్తే 16వ తేదీ నాటికి ఉత్పత్తి దశలోకి వచ్చే అవకాశం ఉంది. ఏటా వానకాలం సీజన్‌లో తెలంగాణకు 9.5 లక్షల టన్నుల యూరియా అవసరం ఉండగా, ఆర్‌ఎఫ్‌సీఎల్ 3.5 లక్షల టన్నుల యూరియా సరఫరా చేస్తున్నది. రోజుకు 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా, 3,850 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి జరుగుతుంది. ఈ ఏడాది 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 0.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి జరిగింది.



రామగుండంలోని ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంటు

**వాణిజ్య**

# ముకేశ్ అంబానీ గురు దక్షిణ

**ఐసీటీకి రూ.151 కోట్ల విరాళం ప్రకటించిన రిలయన్స్ అధినేత**



న్యూఢిల్లీ, జూన్ 7: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ముంబైలోని తాను చదువుకున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐసీటీ)కి రూ.151 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించారు. 1970 దశకంలో ముకేశ్ అంబానీ ఐసీటీలో గ్రాడ్యుయేట్ చేశారు. ప్రొఫెసర్ ఎంఎం శర్మ బయోగ్రఫీ 'డివైన్ సైంటిస్ట్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముకేశ్.. మూడు గంటలపాటు ఐసీటీలో గడిపి, ఈ భారీ విరాళాన్ని దేనికైనా వినియోగించుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రొఫెసర్ శర్మతో అనుబంధాన్ని ఈ సందర్భంగా ముకేశ్ పంచుకున్నారు. ఆ తర్వాతి కాలంలో ఆయన భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలకు ఎలా శ్రీకారం చుట్టారనే విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. లైసెన్స్ పర్మిట్ రాజ్ నుంచి విముక్తి కలిగిస్తేనే దేశీయ పారిశ్రామిక రంగం పుంజుకుంటుందని శర్మ గతంలోనే చెప్పారని, ప్రపంచ దేశాలతో పోటీపడాలంటే ఈ కీలక నిర్ణయం తప్పక తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని ముకేశ్ గుర్తుచేశారు. ఈ విషయాన్ని అప్పటి ప్రభుత్వానికి వివరించడంలో విజయం సాధించారని..అందుకే ఆయనను గురు ఆఫ్ భారత్‌గా కొనియాడారు. ఆయనకు గురు దక్షిణగా ఐసీటీకి రూ.151 కోట్లు విరాళం ఇస్తున్నట్టు అంబానీ ఈ సందర్భంగా ప్రకటించారు.

# 98 వేల దిగువకు పుత్తడి

## హైదరాబాద్‌లో రూ.1,600 తగ్గిన తులం ధర

హైదరాబాద్, జూన్ 7: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తత పరిస్థితులు తగ్గుముఖం పట్టడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ప్రతీకార సుంకాలపై అక్కడి కోర్టు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో ధరలు భారీగా తగ్గాయి. ఇదే క్రమంలో గతవారంలో లక్ష రూపాయలను అధిగమించిన పుత్తడి ధర భారీగా తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.98 వేల దిగువకు పడిపోయింది. పదిగ్రాముల గోల్డ్ ధర రూ.1,630 తగ్గి రూ.97,970కి దిగొచ్చింది. అంతకు ముందు ఇది రూ.99,600గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ రూ.1,500 తగ్గి రూ.89,800కి తగ్గింది.

### వెండి యథాతథం..

గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన వెండి శాంతించింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో దేశీయంగా ధరల్లో పెద్దగా మార్పులు చోటు చేసుకోలేదు. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1,18,000 వద్ద కొనసాగుతున్నది. ప్రస్తుత నెలలో కిలో వెండి ఏకంగా రూ.6 వేలకు పైగా ఎగబాకినట్టు అయింది.

### రెండు నెలల్లో 85 వేలకు?

బంగారం ధరలు భారీగా తగ్గబోతున్నాయా అంటే అవును అంటున్నాయని ఇండస్ట్రీవర్గాలు. వచ్చే రెండు నెలల్లో 12-15 శాతం వరకు తగ్గి రూ.85 వేలకు తులం ధర దిగిరానున్నట్టు బ్రోకరేజ్ సంస్థ క్వాంట్ మ్యూచువల్ ఫండ్ అంచనావేస్తున్నది. ప్రస్తుతం ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం ధర రూ.98 వేల స్థాయిలో కదలాడుతున్నది. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 34 శాతం పెరిగి చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న గోల్డ్ ధర..స్వల్పకాలంలో భారీగా పడిపోనున్నదని వెల్లడించింది. మరో రేటింగ్ ఏజెన్సీ మార్నింగ్‌స్టార్ కూడా గోల్డ్ ధర 38 శాతం పడిపోనున్నదని అంచనావేస్తున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3,361.73 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.



## టాటా మోటర్స్ మాన్‌సూన్ ఆఫర్

ముంబై, జూన్ 7: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్..మాన్‌సూన్ ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద ఈ నెల 20 వరకు ఉచితంగా వాహనాలను చెకప్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. దేశవ్యాప్తంగా 500 నగరాల్లో 1,090కి పైగా ఉన్న ఆథరైజ్డ్ వర్క్‌షాప్‌లలో తమ వాహనాలను ఉచితంగా చెక్ చేసుకోవచ్చునని సూచించింది. వాహనానికి సంబంధించి 30 క్రిటికల్ ఇన్‌స్పెక్షన్ చేసుకోవచ్చును.

## లిమిటెడ్ ఎడిషన్‌గా మినీ కంట్రీమ్యాన్



న్యూఢిల్లీ, జూన్ 7: బీఎండబ్ల్యూ అనుబంధ సంస్థయైన మినీ మరో ఈవీ మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. లిమిటెడ్ ఎడిషన్‌గా మినీ కంట్రీమ్యాన్ ఈ జాన్ కూపర్ కేవలం 20 యూనిట్లు మాత్రమే దేశీయంగా విక్రయిస్తున్నది. ఈ కారు ధర రూ.62 లక్షలుగా నిర్ణయించింది. బుకింగ్ చేసుకున్న కస్టమర్లు ఈ నెల 10 నుంచి డెలివరీ చేయనున్నట్లు కంపెనీ ప్రెసిడెంట్, సీఈవో విక్రమ్ పవాహ తెలిపారు. కేవలం 8.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 462 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ఈ కారుపై రెండేండ్ల పాటు అన్‌లిమిటెడ్ కిలోమీటర్లు వ్యారెంటీ కల్పిస్తున్నది. భద్రత ఫీచర్లను మెరుగుపరచడంలో భాగంగా ఈ కారు నాలుగు ఎయిర్‌బ్యాగ్‌లు, బ్రేక్ అసిస్ట్, 3-పాయింట్ సీట్ బెల్ట్స్, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్, క్రాష్ సెన్సార్, యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్, రియర్ వ్యూ కెమెరా, ఆటో స్టార్ట్/స్టాప్ బటన్‌వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.

## ఏఐ బిల్ట్‌థాన్‌కు నెక్స్ట్‌వేవ్ శ్రీకారం

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : చాట్ జీపీటీని రూపొందించిన ఓపెన్ ఏఐ సంస్థకు చెందిన ఓపెన్ ఏఐ అకాడమీ, హైదరాబాద్‌కు చెందిన నెక్స్ట్‌వేవ్ సంస్థలు జనరేటివ్ ఏఐ బిల్ట్‌థాన్‌ను నిర్వహించబోతున్నాయి. ఇది దేశంలోనే అతిపెద్ద జనరేటివ్ ఏఐ ఇన్నోవేషన్ చాలెంజ్. దేశంలోని ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడమే ఈ బిల్డథాన్ ముఖ్య ఉద్దేశం. హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్, బ్యాంకింగ్ రిటైల్, అగ్రికల్చర్, సస్టెనబిలిటీ రంగాల్లో కీలక సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మొత్తం మూడు స్టేజ్‌లలో ఎంపిక జరుగుతుందని నెక్స్ట్‌వేవ్ విజేతలకు రూ.10 లక్షల వరకు బహుమతిగా అందజేస్తామన్నారు.

## గ్రీన్ పవర్‌లోకి లక్ష కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గ్రీన్‌పవర్ రంగంలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులకి సంబంధించి ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. కర్నూల్ జిల్లాలో నెలకొల్పిన గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్ట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫ్లోటింగ్ సోలార్, హైడ్రోజన్ పవర్ వంటి మార్గాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ పలు దేశాలు ముందుకెళ్తున్నాయని, పగలు సోలార్ విద్యుత్తును స్టోరేజ్ చేసి, రాత్రివేళ పంప్డ్ స్టోరేజీ ద్వారా పీక్ అవర్స్‌లో విద్యుత్తు ఉత్పత్తి చేసే యూనిట్‌ను పరిశీలించామన్నారు.

## ఇన్ఫోసిస్‌కు భారీ ఊరట

న్యూఢిల్లీ, జూన్ 7: దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు భారీ ఊరట లభించింది. 2018-19 నుంచి 2021-22 మధ్యకాలానికి సంబంధించి రూ.32,403 కోట్ల జీఎస్టీ నోటీస్‌పై డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటిలిజెన్స్ క్లీన్‌చిట్ ఇచ్చింది. ఈ విషయాన్ని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ జీఎస్టీ ఎగవేతకు సంబంధించి గతేడాది జీఎస్టీ ఇంటిలిజెన్స్‌తో మూడుదఫాలుగా సమావేశమై స్పష్టతనిచ్చినట్టు, దీంతో ఈ షోకాజ్ నోటీసును వెనక్కితీసుకున్నట్టు కంపెనీ తెలిపింది. జూలై 2017 నుంచి మార్చి 2022 మధ్య ఇన్ఫోసిస్ విదేశీ శాఖల్లో జరిగిన వ్యయాలకు సంబంధించి రూ.32,403 కోట్ల జీఎస్టీ నోటీసును గతేడాది జూలైలో ఇన్ఫోసిస్ అందుకున్నది.